క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



మురుగు కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

ఉయ్యాలవాడ : స్థానిక బీసీ కాలనీలో చేపట్టిన మురుగు కాలువ నిర్మాణ పనులను ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనుల కోసం, ఇదే కాలనీలో 4వ అంగన్‌వాడీ కేంద్రంలో దెబ్బతిన్న బండ పరుపు మరమ్మతు కోసం ఎంపీపీ నిధుల నుంచి రూ. 4.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, నర్సిపల్లె గ్రామ సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి వున్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



తెలుగు దేవికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ షఫీ

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన తెలుగు దేవి అనే మహిళ అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. గురువారం పింఛన్ల పంపిణీ చివరి రోజు కావడం, ఆమె ఇంటికి రాలేని పరిస్థితుల్లో ఉండటంతో వలంటీర్ షఫీ వైద్యశాలకు వెళ్లి రూ.2,750 పింఛన్‌ను సొమ్మును అందజేశారు. తన వైద్యఖర్చులకు ఈ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతుందని లబ్ధిదారురాలు.. వలంటీర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది.

20న రాష్ట్రస్థాయి భజన పోటీలు

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో మూలపెద్దమ్మ ఆశీస్సులతో ఎల్లమ్మ తల్లి ఆలయంలో దసరా నవరాత్రులను పురస్కరించుకొని ఈనెల 20న రాష్ట్రస్థాయి తాలాల భజన పోటీలు నిర్వహిస్తున్న భజన బృందం గురువారం తెలిపారు. రూ.20వేలు, రూ.18వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.1,500ఇలా వరుసగా ఎనిమిది నగదు బహుమతులను అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఉత్తమ తబలిస్టు రూ.1,000, ఉత్తమ గాయలకులకు రూ.500 ఇస్తున్నట్లు వెల్లడించారు. రూ.300 డిపాజిట్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9908288071, 9703726313 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

7న జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 7న ఎస్ఎస్‌డీసీ స్కిల్ ఇండియా శిక్షణ భాగస్వామి ఇమార్టికస్ ద్వారా సొసైటీ ఆఫ్ జేకేసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ, ఈవైఏడీపీలో, బ్యాంకింగ్ ఉద్యోగాలు, జేపీ మార్గన్, స్టేట్ స్ట్రీట్‌లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 26సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉండరాదన్నారు. అర్హత డిగ్రీ, బీటెక్ ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 9321825558, 7799337695 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రైవేటు స్కూల్ టీచర్లు, లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా రసూల్



అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ప్రైవేటు స్కూల్ టీచర్లు, లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్పీ రసూల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు హిందీ వికాస కేంద్రం నంద్యాల జిల్లా అధ్యక్షుడు జమాలాపురం సురేష్ బాబు గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో నంద్యాల జిల్లా ఎస్పీఎల్‌టీఓ అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. సభ్యులు హరిచందన్, జహింగీర్, సాయి, నరసింహులు, శ్రీనివాసులు, బాషా హుసేన్, జయప్రకాష్, ఎస్ఎండీ రసూల్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాది మృతి

నంద్యాల(వ్యవసాయం): పెద్దకొట్టాల గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది బోరెడ్డి సోమేశ్వరి గురువారం ఢిల్లీలో అకాల మరణం చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త జాడ కోసం వెతికే క్రమంలో మనోవేదనకు గురై మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మరణం పట్ల బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు. అసోసియేషన్ కార్యాలయంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణ, బొల్లెద్దుల రవి, ప్రతాపరెడ్డి, రాజేశ్వరి, కృపావతి, త్రివేణి, అనిత తదితరులు పాల్గొన్నారు.











క్రిష్టిపాడులో ఓపీ కోసం గుమికూడిన ప్రజలు, పెద్దకొట్టాలలో రక్త పరీక్షలపై సిబ్బందితో చర్చిస్తున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి , డి.వనిపెంటలో పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, ఇంజేడులో ఈసీజీ పరీక్షలు చేస్తున్న దృశ్యం, శ్రీరంగాపురంలో మందులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజలకు మరింత చేరువైన వైద్యం

- ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు
- ప్రజలకు సంతృప్తి నిచ్చేలా సేవలు



నంద్యాలలో కేస్‌షీట్‌ను అందిస్తున్న మున్సిపల్ కమిషనర్, వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ రఫీ

నంద్యాల(సిటీ): ప్రజల ఆరోగ్య రక్షణలో భాగంగా ప్రజలకు వైద్య సేవలను జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మరింత చేరువయ్యాయని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక దేవనగర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ రఫీతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఉత్తమ సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో పిడియాట్రిషియన్‌కు 125, కంటివెలుగు కింద 139, ఆరోగ్యశ్రీ రెఫరల్ కింద 4 పేషంట్లను పంపడం జరిగిందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి తెలిపారు. అదేవిధంగా రక్తపరీక్షలు 258, ఈసీజీ 242 మందికి గుండె సంబంధించిన పరీక్షలు చేయడం జరిగిందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను అందించారు. శిబిరంలో 575మందికి ఏడు రకాల వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్‌డీ మహిధర్‌రెడ్డి, డాక్టర్ అష్రఫ్‌వలి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ దీవించాలి

చాగలమర్రి: జగనన్న లాంటి ముఖ్యమంత్రిని మనమందరం వచ్చే ఎన్నికల్లో దీవించి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని, ఆయన ప్రజలకు అందిస్తున్న సేవలకు మనమంతా ఎంతో రుణపడి ఉన్నామని జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి, ఎపీపీ వీరభద్రుడు, సర్పంచ్ బాలీశ్వరరెడ్డి అన్నారు. వారు మండలంలో 3వ రోజు డి.వనిపెంట గ్రామంలోని సచివాలయ ఆవరణలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, డాక్టర్ అంజలి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో సుమారు 300 మంది వైద్య సేవలు పొందగా అందులో 28 మందిని మెరుగైన చికిత్స కోసం నంద్యాల, కర్నూలులోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. 10 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, సర్పంచ్ బాలీశ్వరెడ్డి, తహసీల్దార్ సుభద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇంజేడు గ్రామ సచివాలయం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యులు కిరణ్, జనరల్ సర్జన్ ఎండీ శ్రీకాంత్‌రెడ్డి, వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, శివలింగమ్మ, వైద్య బృందం 540 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. 15 మందికి మెరుగైన చికిత్సల కోసం నంద్యాల, కర్నూలు, ఇతర ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ వైద్యశాలలకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు మెంబర్ గజ్జెల క్రిష్టారెడ్డి, నర్సిపల్లె, కాకరవాడ సర్పంచ్ గురుప్రసాద్‌రెడ్డి, ఉప సర్పంచ్ పార్థసారథిరెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రవి కుమార్ పాల్గొన్నారు.



జూలేపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష ఆదరణ

రుద్రవరం: మండలంలో కొన సాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష ఆదరణ లభిస్తోంది. గురువారం మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామ సచివాలయం వద్ద అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో నంద్యాల ఆసుపత్రి జనరల్ సర్జన్ తేజారెడ్డి, గైనకాలజిస్టు జ్యోతి వాణి, ఫిజీషియన్ షబ్బీర్‌వలి, రుద్రవరం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదు, శ్రావణి తదితరులు 438 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.సీడీపీఓ తేజస్విని ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పలు రకాల పోషకాహారాలతో స్టాల్ ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీఎల్‌డీఓ జనార్దన్, తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మదుసూధరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాశన్న, నాయకులు మధు, పామన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

శిరివెళ్ల: మహదేవపురంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం విజయవంతమయ్యింది. శిబిరానికి 434 మంది హాజరు కాగా వారికి నంద్యాలకు చెందిన స్పెషలిస్టులు డాక్టర్ దినేష్‌రెడ్డి, శ్రావణి, సునీత, గాజులపల్లె ప్రభుత్వ డాక్టర్లు డాక్టర్ వెంకటరెడ్డిలు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంను డీఎల్‌డీఓ జనార్దన్‌రావు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు స్టాల్ ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచు పెద్ది రమణయ్య, బోయలకుంట్ల సర్పంచు జింకల నాగన్న, మార్కెట్ యార్డు వైఎస్ చైర్మన్ నరహరి, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర పాల్గొన్నారు.



మహదేవపురంలో కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న డాక్టర్లు



క్రిష్టిపాడులో రోగులకు ఉచితంగా మందులను అందజేస్తున్న ఎంపీపీ, డాక్టర్లు

వైద్య పరీక్షలు బాగా చేశారు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మా గ్రామంలో వైద్య పరీక్షలు బాగా చేశారు. నెల రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నా. శిబిరంలో అన్ని రకాల పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. మాలాంటి మధ్య తరగతి కుటుంబాలు పట్టణ ప్రాంతాలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసి వైద్యం చేయించుకోవాలంటే సాధ్యం కాదు. గతంలో ఇలాంటి వైద్య శిబిరాలు ఏ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు.

– లక్ష్మిదేవి, ఇంజేడు

సేవలు సంతృప్తినిచ్చాయి



ఎంత మంది నాయకులు మారినా ఇలాంటి వైద్యశిబిరాలు పెట్టి మాలాంటి పేదలకు వైద్యం అందించిన నాయకుడు లేడు. వైద్యులు చాలా మంచిగా చూస్తున్నారు. కొంత కాలంగా నేను ఆయాసంతో బాధ పడుతున్నాను, వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి మరీ నా ఆరోగ్య వివరాలను అడిగి మరీ వైద్య శిబిరం వచ్చి చూపించుకోవాలని చెప్పారు. వైద్యులు నాకు పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

–షేక్ మదార్‌సా, శ్యాంనగర్, నంద్యాల

పల్లెవాసుల చెంతకే వైద్యం

దొర్నిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పల్లెవాసులకు ఉచితంగా అందించాలనే గొప్ప సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో గ్రామ సర్పంచి శివరామిరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు శిరీష, భార్గవి, విజయభాస్కర్‌రెడ్డి, నాగేంద్ర, నరసింహులు సాధారణ వైద్యం కింద 151, గైనిక్ కింద 12, విద్యార్థులు 10, జగనరల్ కింద 392 మందికి వైద్యపరీక్షలను చేశారు. అలాగే ఈసీజీ 50, మలేరియా 30, డెంగీ 10, గల్ల పరీక్షలు 30, షుగర్ 250, రక్తపరీక్షలు 210 మందికి అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతలరెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఎంఈఓ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామీణ ప్రాంతంలో ఇంటింటికీ ఆరోగ్యం చేకూరేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు కాంతరావు నాయక్, వెంకటేశ్వర్లు, ప్రియదర్శిని, శ్రీనివాస్, మురళీ, మనోహర్ తదితరులు 406 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 44 మందిని రెఫరల్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఈఓఆర్‌డీ అనసూయ పాల్గొన్నారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: మూడవ విడతలో చేపట్టిన గ్రామాల్లో రీ సర్వే పనులను పకడ్బందీగా, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి భూ పరిపాలన శాఖ కమిషనర్ సాయి ప్రసాద్ మూడవ దశ రీ సర్వే పనుల ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మూడవ దశ రీ సర్వే పనుల ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత కాల పరిమితిలోగా పూర్తి చేయాలని సూచించారు. మూడో విడతలో 150 గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే పనుల ప్రగతిపై పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకొని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండవ దశలో 73 గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేలో స్టోన్ ప్లాంటేషన్ పూర్తయిందని, 338 గ్రామాల్లో భూముల క్రమబద్ధీకరణకు వీఆర్ఓ, తహసీల్దార్, జేసీ లాగిన్‌లో ఉన్న సర్వీసులు క్లియర్ అయ్యాయని జేసీ వివరించారు. 2003 సంవత్సరం మునుపు అసైన్డ్ భూములకు పట్టాలిచ్చిన రైతులు క్రయవిక్రయాలు జరుపుకునేందుకు ప్రభుత్వం అంగీకరించిందని కలెక్టర్ తెలిపారు.

మత్స్యకారులకు రాయితీపై వలలు, తెప్పలు

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, మత్స్య అభివృద్ధి పథకాల కింద 75 శాతం రాయితీతో మత్స్యకారులకు వలలు, తెప్పలు అందజేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జలాశయాలు, చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు లైసెన్స్ కలిగిన వారు, మత్స్య సహకార సంఘాల సభ్యులు మాత్రమే అర్హులన్నారు. వల, తెప్ప కలిపి రూ.50 వేలు కాగా ఇందులో లబ్ధిదారుడు తన వాటాగా రూ.12,500 భరిస్తే, మిగతా రూ.37,500ల రాయితీ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. వచ్చే సోమవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అన్ని అంశాలు క్రోడీకరించిన తర్వాత అర్హుల జాబితాను కమిషనర్ కార్యాలయానికి పంపుతామని చెప్పారు. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని వారు, వెంటనే సంబంధిత సచివాలయాన్ని సంప్రదించాలని లేదా బొమ్మలసత్రం బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లోని మత్స్యశాఖ జేడీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రాయితీపై చేప పిల్లలు

చిన్న నీటి పారుదల శాఖ కింద ఉన్న చెరువులు, జలాశయాల్లో చేపపిల్లలు వదిలే వారికి ప్రభుత్వం రాయితీతో లబ్ధి కలిగిస్తోందని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి తెలిపారు. 100 హెక్టార్లలో లక్ష చేప పిల్లలు వదిలితే అందులో 40 వేల చేప పిల్లల కొనుగోలుకయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని, మిగతా 60 వేల చేప పిల్లల ఖర్చు లబ్ధిదారుడు పెట్టుకోవాలని తెలిపారు. లక్ష చేప పిల్లలకు రూ.64 వేల దాకా రాయితీ అవుతుందని అన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

మహానంది: వన్యప్రాణులకు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌జా తెలిపారు. బండిఆత్మకూరులోని మోడల్‌స్కూల్‌లో గురువారం వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అడవుల సంరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణ కూడా ముఖ్యమన్నారు.

నంద్యాల నుంచి రైళ్లు కొనసాగించాలి



జీఎంకు వినతి పత్రం ఇస్తున్న జుబేర్‌బాషా

నంద్యాల(అర్బన్): నంద్యాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు మరిన్ని రైల్వే సర్వీసులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మెంబర్ ఎస్ఎండీ జుబేర్ బాషా కోరారు. సికింద్రాబాద్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో గురువారం జరిగిన 75వ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో సౌత్‌సెంట్రల్ రైల్వే జీఎం ఏకే జైన్‌కు వినతి పత్రం ఇచ్చారు. జుబేర్‌బాషా మాట్లాడుతూ 17261 నెంబరు గల గుంటూరు–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను విలుపురం వరకు పొడిగించాలన్నారు. 17253 గుంటూరు–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను నాగర్సౌల్ వరకు పొడిగిస్తే షిర్డీకి వెళ్లేందుకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. గుంటూరు–డోన్ ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం వరకు, గుంటూరు–నర్సాపురం వరకు పొడిగించాలన్నారు. ఉదయం పూట ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ధర్మవరం–నర్సాపురం వరకు నంద్యాల, విజయవాడ మీదుగా నడపాలని కోరారు. డబ్లింగ్ పనుల నిమిత్తం నంద్యాలలో ఒక పిట్‌లైన్‌ను ఏర్పాటు చేసి నంద్యాల నుంచి కొత్త రైళ్లు ప్రారంభించాలన్నారు. మైసూర్–రేణిగుంట వారంతపు ఎక్స్‌ప్రెస్‌ను నంద్యాల వరకు పొడిగించాలని, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కృషి చేస్తున్న కర్నూలు–నంద్యాల రైలు మార్గం త్వరలో కార్యాచరణలోకి రావాలని విన్నవించారు. పై సమస్యలపై జీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలో డెంగీ, మలేరియా విషజ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ అధికారులను కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 42వ వార్డులో దోమలు విపరీతంగా వృద్ధి చెంది డెంగీ, మలేరియా విషజ్వరాలతో అల్లాడుతున్నారన్నారు. వార్డుల్లో ఫాగింగ్ చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ నియంత పాలనను వ్యతిరేకించాలి

నంద్యాల(న్యూటౌన్): దేశంలో మోడీ ప్రభుత్వం నియంతపాలనను వ్యతిరేకించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న మీడియా సంస్థలపై, జర్నలిస్టుల ఇళ్లపై, శాస్త్రవేత్తలు, చరిత్ర కారులు, కళాకారుల, ప్రతిపక్ష, వామపక్ష పార్టీల నాయకుల ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసి వారిపై ఉపా చట్టాన్ని ఉపయోగిస్తోందన్నారు. ఇది పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఉల్లంఘనే అన్నారు. సమావేశంలో బాబాఫక్రుద్దీన్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలిగా స్వాతి

నంద్యాల(వ్యవసాయం): భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చ నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా బత్తిని స్వాతిని నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. స్వాతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇవ్వడం జరిగిందన్నారు. మహిళల సమస్యలపైన, మహిళా సాధికారత కొరకు తనవంతు కృషి చేస్తానని వారు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): ప్రింటింగ్ ప్రెస్ వర్కర్ రాజు అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు జమాల్‌బాషా, దశరథరాము, మాబాషాలు మాట్లాడుతూ అసోసియేషన్ తరపున అందరి సహకారంతో రూ.21వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందన్నారు.

నేడు శెట్టివీడులో వైద్య శిబిరం

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పంచాయితీ పరిధిలోని శెట్టివీడుతో పాటు కెపీ తాండా, జున్నాపురం గ్రామాలకు చెందిన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి



12వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పారవి తదితరులు

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి
- 12వ వార్డులో కల్వర్టు ప్రారంభం

నంద్యాల(సిటి): పట్టణంలో అవసరాలను గుర్తించి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 12వ వార్డులో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ డాక్టర్.కల్లూరి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.10లక్షలతో నిర్మించిన కల్వర్టు, డ్రైన్‌లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పట్టణం జిల్లా కేంద్రం అయ్యాక పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించి, సగటు నంద్యాల వాసి ఔరా అనే రీతిలో అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు. అన్ని వార్డులలో సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణాలు, నూతన కల్వర్టులు, విద్యుత్ దీపాలు ఇలా అన్ని అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. పట్టణంలో విశాలమైన రోడ్లు ఏర్పాటు చేసి వాటిని సీసీ రోడ్లతో కనెక్ట్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు డీఎస్.హబీబుల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునిత అమృతరాజ్, వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, వైస్ చైర్మన్ గంగిశెట్టిశ్రీధర్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ పథకాల పండుగ



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): గడప గడపలో సంక్షేమ పథకాల పండగ జరుగుతుందని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక దేవనగర్‌లో వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దిలీప్‌కుమార్‌ల ఆధ్వర్యంలో 152వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముందుగా వార్డులో నెలకొన్న సమస్యల పై ప్రజలను, నాయకులను, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అర్హత ఆధారంగా పథకాలను నేరుగా వలంటీర్ ద్వారా అందించి, వారి బాగోగులు చూస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల కంటే మిన్నగా సంక్షేమం , అభివృద్ధిని చేసి చూపిస్తూ ప్రజల మనసులో చెరగని ముద్రను సీఎం జగనన్న వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, ఏపిఎస్పిడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, రెండో క్లస్టర్ ఇన్‌చార్జ్ జాకీర్‌హుస్సేన్, వైస్ చైర్మన్ పాంశావలి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు ప్రభాకర్, కారు రవికుమార్, దేవనగర్ బాషా, షాలి, రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం చర్య రాష్ట్రానికి శరాఘాతం

నంద్యాల(సెంట్రల్): కృష్ణాజలాలపై కేంద్రం చర్య రాష్ట్రానికి శరాఘాతంలా మారుతుందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకంపై పునఃపరిశీలన చేసి, కొత్తగా కేటాయింపులు జరిపేందుకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించిన విధివిధానాలు విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నాయన్నారు. దీని ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులకు రక్షణ కలిప్తూనే, క్రమానుగత అవసరాల దృష్ట్యా కేటాయింపులు పెంచే విధంగా ఉండాలని చట్టం చెబుతోందన్నారు. కానీ కేంద్రం తెలంగాణ ఒత్తిడికి తలొగ్గి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అదనపు అధికారాలు కట్టబెట్టడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో సీమకు అన్యాయం జరిగే పరిస్థితులు తలెత్తితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.